

దుబ్బాక నియోజకవర్గంలోని
అక్బర్‌పేట-భూంపల్లి వద్ద కూడవెల్లివాగులో వరద ప్రవాహం



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం



మత్తడి దూకుతున్న సిద్దిపేట చెక్‌డ్యామ్



కోహెడ : మత్తడి దూకుతున్న సింగరాయ ప్రాజెక్టు



వర్గల్ : నాచారం-నర్సంపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరద



సిద్దిపేట కమాన్ : లింగారెడ్డిపల్లి గ్రామ శివారులో రోడ్డు పై నుంచి పారుతున్న వరద



కోహెడ : మత్తడి దూకుతున్న శనిగరం ప్రాజెక్టు

# ఉప్పొంగిన వాగులు



సిద్దిపేట : నంగునూరు మండలం అక్కెనపల్లిలో పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాములు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. కల్వర్టులు, బ్రిడ్జిలపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో పలుచోట్ల రోడ్లను మూసివేశారు. కురుస్తున్న వర్షాలతో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం సూచించింది. పలు గ్రామాల్లో ఇండ్లు కూలిపోయాయి. పంటలు నీట ము నిగాయి.

*- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబర్ 2*



మత్తడి దూకుతున్న సిద్దిపేట కోమటి చెరువు



దుబ్బాక : రామసముద్రం చెరువు నిండి పొంగిపొర్లుతున్న వరద



సిద్దిపేట : మత్తడి దూకుతున్న కోమటి చెరువు వద్ద చేపలు పడుతున్న జాలర్లు



హుస్నాబాద్ : ఎల్లమ్మ చెరువు మత్తడి దూకడంతో
హుస్నాబాద్-మాలపల్లి రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న ప్రజలు

## బడికి పోయేదెట్లా ?

**పిట్టలగూడెంలో పాఠశాల చుట్టూ చేరిన వర్షపు నీరు**



పిట్టలగూడెం పాఠశాల ఎదుట చేరిన వర్షపు నీరు

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 2 : మద్దూరు మండలంలోని పిట్టలగూడెం ప్రాథమిక పాఠశాల చుట్టూ వర్షపునీరు చేరడంతో పాఠశాలకు విద్యార్థులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షం వస్తే పాఠశాల చుట్టూ నీరు చేరుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం బడికి వచ్చే విద్యార్థులకు వర్షం నీరు స్వాగతం పలకనున్నది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో పాటు బీటీ రోడ్డుకు దిగువన పాఠశాల భవనం ఉండడంతో వర్షపునీరంతా పాఠశాల ముందుకు చేరుతుంది. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే మాదిరిగా జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాఠశాల చుట్టూ వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గజ్వేల్‌లో కాల్వ ద్వారా నీటిని తొలిగిస్తున్న సిబ్బంది

గజ్వేల్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి సూచించారు. సోమవారం పట్టణంలోని ఆయా వార్డులను కమిషనర్ గోల్కొండ నర్సయ్యతో కలిసి పర్యటించారు. కాలనీల్లో నీటి నిల్వను జేసీబీసాయంతో తొలిగించారు. పట్టణంలోని వచ్చే వరద నీటిని కాల్వలు తీసి మళ్లించారు. ఇండ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా తొలిగించారు. ప్రజ్ఞాపూర్‌లోని ఊర చెరువును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కౌన్సిలర్లు రజిత, మెట్టయ్య, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, ఏఈ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**సిద్దిపేటలో..**

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 2 : భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట 5 వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ సూచించారు. వార్డులో సోమవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలను బయటకు రాకుండా చూడాలన్నారు.

## వరద ప్రభావిత కాలనీలను పరిశీలించి మంత్రి



హుస్నాబాద్ పట్టణ శివారులో వరద పరిస్థితులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, సెప్టెంబర్ 2: హుస్నాబాద్ పట్టణంలోని పలు వరద ప్రభావిత కాలనీలను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పోతారం రోడ్డు, పోలీస్‌స్టేషన్ పరిసరాలు, శ్మశాన వాటిక, మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అక్కడి వరద పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి వరద తాకిడి లేకుండా చేపట్టాల్సిన పనుల నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్ ఉన్నారు.

## లభ్యం కాని జాలరి ఆచూకీ..

**రెండో రోజు గాలింపు చేపట్టిన అధికారులు, గ్రామస్తులు**



గాలింపు చర్యల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు

బెజ్జంకి, సెప్టెంబర్ 2 : మండలంలోని తోటపల్లి రిజర్వాయర్ మత్తడి వద్ద ఆదివారం గల్లంతైన లక్ష్మణ్ అనే జాలరి ఆచూకీ రెండో రోజు లభ్యం కాలేదు. చేపలు పట్టేందుకు వెల్లిన లక్ష్మణ్ ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో గల్లంతయ్యాడు. సీఐ శ్రీనివాస్, ఎస్ కృష్ణారెడ్డి, ఫైర్‌స్టేషన్ సిబ్బంది, గ్రామ జాలరీలు వరద వెళ్లే పరిసరాల్లో గాలించినా ఫలితం దక్కలేదు. కానీ అతని చెప్పులు, సంచి, తువ్వలను గాలింపు సిబ్బంది గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంఘటనా స్థలానికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రామూర్తి, ఈఈ రాములు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

## లెనిన్‌నగర్‌లో 30 మంది సురక్షిత ప్రాంతానికి తరలింపు



లెనిన్‌నగర్‌లో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సై రాజుగౌడ్

కొమురవెల్లి, సెప్టెంబర్ 2 : మండలంలోని లెనిన్‌నగర్‌లో పాత కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉన్న 10 కుటుంబాలకు చెందిన 30 మందిని సోమవారం సాయంత్రం కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సై లింగంపల్లి రాజుగౌడ్ ఆధ్వర్యంలో ముందస్తుగా గ్రామంలోని గ్రామ పంచాయతీలోకి తరలించారు. కాగా శనివారం రాత్రి వారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా ఆదివారం మళ్లీ ఇండ్లలోకి వచ్చిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సై లింగంపల్లి రాజుగౌడ్ వారందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి అవసరమైన సమగ్రి ఇవ్వడంతో పాటు భోజనం పెట్టించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో వారికి ఇబ్బందులు కలుగుతాయని గుర్తించి ముందస్తుగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ సనాది సబితాభాస్కర్, సిబ్బంది ఉన్నారు.

## వరద ప్రవాహాన్ని పరిశీలించిన తహసీల్దార్



గాగిల్లాపూర్‌లో చెరువు మత్తడిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజయ్ కుమార్



దుబ్బ తండాలో వర్షపునీటిని మళ్లిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 2 : మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ పెద్ద చెరువును తహసీల్దార్ సంజయ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మత్తడి నీటి ప్రవాహాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తడి ప్రవాహం ఉన్న దృష్ట్యా వాహనాల రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు. మండలంలో 8 పెంకుటిండ్లు కూలిపోయినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికను అందజేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రమేశ్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, కార్యదర్శి రజియాబేగం ఉన్నారు.

**దుబ్బ తండాలో :** ధూళిమిట్ట మండలంలోని దుబ్బతండాలో వర్షపునీరు ఇండ్లలోకి చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో తహసీల్దార్ మధుసూదన్ తండాను సందర్శించి, సహాయక చర్యలు చేపట్టారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట,సెప్టెంబర్ 2 : సీజనల్ వ్యాధులు రాకుండా దోమలు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్యాఆరోగ్య శాఖ పీవో ఎంహెచ్ఎన్ డాక్టర్ అనంద్ అన్నారు. సోమవారం రాజ్‌గోపాల్‌పేట పీహెచ్‌సీ పరిధితోని పాలమాకుల ఎస్సీ బాలుర హాస్టల్‌ను, బస్వాపూర్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయ పాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

**ములుగులో..**

ములుగు, సెప్టెంబర్ 2 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్‌హెచ్ఎన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ సూచించారు. మండల కేంద్రం ములుగులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటెన్సీవ్ ఫీవర్ సర్వేపై ఆరాతీశారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉన్నారు.

## రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి



కొమురవెల్లిలో గుంతల మయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, సెప్టెంబర్ 2 : కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి రాజీవ్‌రహదారి నుంచి కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం వరకు ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలో గుంతలమయంగా ఉన్న రోడ్డు పరిసరాలను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రమాదాలకు నెలవుగా మారిందని అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేటపట్టాలని హెచ్చరించారు. సీపీఎం పార్టీ నాయకులు తాడూరి రవీందర్, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, ఆరుట్ల రవీందర్, తాడూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

మర్కూక్, సెప్టెంబర్ 2 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీజనల్ వ్యాధులు రాకుండా పాఠశాల, హాస్టల్ గదుల్లో స్వచ్ఛత పాటించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏమైనా హెల్త్ సమస్య ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్రగాయాలు

గజ్వేల్, సెప్టెంబర్ 2 : విద్యుత్ అంతరాయం కారణంగా విద్యుత్ ఫోల్‌పై జంపర్‌ను బిగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి హెల్పర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోవెళితే.. ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన మెతుకు శివ లైన్‌మెన్ వద్ద హెల్పర్. సోమవారం శ్రీగిరిపల్లి గ్రామ బస్టాప్ వద్ద విద్యుత్ స్తంభంపై జంపర్‌ను బిగించేందుకు స్తంభం ఎక్కి బిగిస్తున్న క్రమంలో కరెంట్‌షాక్ తగలడంతో మంటలు చేలరేగాయి. దీంతో కిందపడిపోవడంతో వెంటనే అతడిని ప్రజ్ఞాపూర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు.

## పేదల పాలిట శాపంగా 'హైడ్రా'

**బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌రావు**

చేర్యాల, సెప్టెంబర్ 2 : హైదరాబాద్ పట్టణంలో చెరువుల పక్కన నివసిస్తున్న పేద ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారు నివసిస్తున్న ఇండ్లను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హైడ్రా పేదల జీవితాల్లో విధ్వంసం సృష్టిస్తూ వారి బతుకులను రోడ్డుపాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ప్రజలకు కన్నీళ్లు తప్ప పరిష్కారం లేదన్నారు.

## మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

చేర్యాల, సెప్టెంబర్ 2 : ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ చివరి సోమవారం పురస్కరించుకొని సహస్ర బిల్వార్చన, ఏకదశ రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, మల్లన్న ఆలయ ప్రధానర్చాకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు సురేందర్, శ్రీరాములు, అకౌంటెంట్ శంకర్ శర్మ, విద్యుత్ విభాగం ఏఈ భాస్కరరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఎస్టీపీ ట్యాంక్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



చింతల్ చెరువు ఎస్టీపీ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట, సెప్టెంబర్ 2 : సిద్దిపేట పట్టణంలోని చింతల్ చెరువు ఎస్టీపీ ట్యాంక్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సందర్శించారు. మురుగు నీటి శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. మురుగు నీటిని వంద శాతం శుద్ధిచేయడంతో పాటు వాటిని వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే విధానాన్ని ఆక్కడి అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్వహణ సమర్థవంతంగా చేయాలని సూచించారు. ఏఈలు అన్వేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌కు నివాళి

హుస్నాబాద్, సెప్టెంబర్ 2: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ఆర్ వర్ధంతిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కేడం లింగమూర్తి, వల్లపు రాజు, భూక్య సరోజన, చిత్తారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 2 : సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సోమవారం నిర్వహించిన ఒకినవా మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కొండపాక మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జి.ప్రవాస్(గోల్డ్), సీహెచ్.పవన్(సిల్వర్) వి.చరణ్(కాంస్య), జి.అక్షయ్(కాంస్య), ఎస్.ధనుశ్(కాంస్య) పతకాలు గెలిపొందారు. నవంబర్‌లో పూణెలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొంటారని ఇన్‌స్పెక్టర్ నర్సింహులు తెలిపారు.